విరిగిపడ్డ కొండ చరియలు

ప్రజాశక్తి -అనంతగిరి:మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వానలతో అనంతగిరి ఘాట్ రోడ్డు ఒకటో నెంబర్ మలుపు సమీపం వద్ద కొండచరియలు విరిగిపడడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. అరకు నుండి ఎస్.కోట విశాఖ, విశాఖ విజయనగరం ఎస్.కోట నుండి అరకు ప్రయాణించే వాహనాల రాకపోకలకు గంటల తరబడి ట్రాఫిక్ అంతరాయం నెలకొంది. దీంతో ప్రయాణికులు గంటల తరబడి తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక రెవిన్యూ, పోలీస్ యంత్రాంగం జెసిబి సాయంతో విరిగిపడ్డ కొండ చరియలను తొలగించి రాకపోకలను యధావిధిగా కొనసాగించారు.

జెసిబితో చేపడుతున్న తొలగింపు పనులు

ఎడతెరిపిలేని భారీ వర్షాలు

- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- కొట్టుకుపోయిన కల్వర్టులు
- పలు గ్రామాలకు రాకపోకలు బంద్
- నీట మునిగి పంట పొలాలు

అనంతగిరి మండలం పూతికపుట్టు వద్ద కొట్టుకుపోయిన కల్వర్టు

జికె.వీధి మండలం దేరాల గ్రామంలో నీటమునిగిన పంట చూసి ఆవేదన చెందుతున్న రైతులు

ప్రజాశక్తి -సీలేరు

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా ఏజెన్సీలో ఎడతెరిపి లేని భారీ వర్షాలు కురుస్తున్నాయి. జీకే వీధి మండలంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు తెరిపివ్వకుండా వర్షం కురిసింది. దీంతో మండలంలోని వంచల పంచాయతీ చామగెడ్డ, దేవరపల్లి పంచాయతీ డేరాల, అంటితోమల గ్రామాల సమసంలో కొండల మీద నుండి వర్షపు నీరు వాగుల్లోకి ఉప్పొంగి పంట పొలాలు నీటి మునిగాయి. పంటలు కొట్టుకుపోయాయి. గాలికొండ పంచాయతీ గొల్లపల్లి ఏ దారకొండ పంచాయతీ పరిధిలో 25 ఎకరాల వరి పొలాలు పూర్తిగా వరదలకు కొట్టుకుపోగా, జీకే వీధి మండలంలో సుమారు 100 ఎకరాలు వరకు పంట పొలాలు నీటి మునిగినట్లు రైతులు చెబుతున్నారు. ఆ దృశ్యాలను చూసి రైతులు లబోదిబోమంటూ గుండెలు బాదుకుంటున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరుతున్నారు.

బురదమట్టి కప్పేసిన వరి పొలాలు

కొట్టుకుపోయిన చేమగెడ్డ వంతెన

మరో వైపు వంచల పంచాయతీ చేమగెడ్డ వంతెన కొట్టుకుపోయింది. దీంతో ఆ పంచాయతీ పరిధిలో ఉన్న 30 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. నడిమి వీధి, గొల్లపల్లి, పెబంపల్లి జాజి పాకల, నల్లమొగ్గ, తడకపల్లి, కొండపల్లి, దబ్బగొంది, చింతల వాడ, కన్నసిమల గొంది, తదితర గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. అధికారులు సహాయ చర్యలు చేపట్టకపోవడంతో వారు బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. నిత్యవసర సరుకులు, వైద్య సేవలకు రావాలంటే ఇదే ప్రధాన రహదారి కావడంతో వారంతా ఇబ్బందులు పడుతున్నారు.

కొట్టుకుపోయిన జికె.వీధి మండలం చేమగెడ్డ కల్వర్టు

రోడ్లన్నీ జలమయం

ఎడతెరిపి లేని కుండ పోత వర్షం కారణంగా జికె.వీధి ఎంపీడీవో, ఎమ్మార్వో కార్యాలయాలు జలమయమయ్యాయి. డ్రైనేజీలు పొంగడంతో రహదారులు పూర్తిస్థాయిగా జలమయమయ్యాయి. జీకే.వీధి మార్కెట్ సెంటర్‌లో నీరు ఏరులై పారింది. లోతట్టులో ఉన్న ఇళ్లలోకి నీరు చేరింది. రోజంతా వర్షం కురవడంతో సీలేరు వారపు సంతకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నిత్యవసర సరుకులు కొనుగోలు చేసుకోవడానికి వచ్చిన మారుమూల ప్రాంత గిరిజనులు, దుప్పిలివాడ, కాట్రగెడ్డ, పిల్లి గెడ్డతో పాటు ఆంధ్ర ఒరిస్సా సరిహద్దు నుంచి కూరగాయలు తెచ్చిన గిరిజనులు రైతులు పలు ఇబ్బందులు పడ్డారు. స్థానికంగా వ్యాపారాలు సాగలేదు.

ఘాట్ రోడ్డులో వాహనాల రాకపోకలు నిలుపుదల

ఎడతెరిపి లేకుండా కుండపోత వర్షాలు కారణంగా లంబసింగి ఘాట్ రోడ్లో కొండ చరియలు విరిగి పడే ప్రమాదం ఉన్నందున జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశాల మేరకు లంబసింగి ఘాట్ రోడ్‌లో వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిపివేసినట్లు జీకేవీధి ఎస్సై అప్పలసూరి తెలిపారు. సప్పర్ల దారకొండ ఘాట్ రోడ్లో రాకపోకలు బందు చేయవలసి ఉందని, కలెక్టర్ నుంచి ఆదేశాలు వస్తే అమలు చేస్తామని పేర్కొన్నారు. అలాగే విశాఖపట్నం వయా నర్సీపట్నం చింతపల్లి సీలేరు మీదుగా భద్రాచలం వెళ్లే నైట్ సర్వీస్ బస్సులను ఆర్టీసీ అధికారులు నిలిపివేశారు.

పొంగి ప్రవహిస్తున్న కొండవాగులు

మారేడుమిల్లి : మండలంలోని చావడికోట పంచాయతీ బొడ్లంక గ్రామ సమీపాన ఉన్న పెళ్లిరేవు కాలువ కల్వర్టు, పుల్లంగి పంచాయితీ చెలకవీధి సమీపాన ఉన్న కొండవాగు కల్వర్టుపై నుండి వరద నీరు పొంగి ప్రవహిస్తోంది. సున్నంపాడు పంచాయతీ నూరుపూడి గ్రామాలను కలుపుతూ ఉన్న రోడ్డు మార్గంలో కొండ వాగు పొంగి పోర్లుతోంది. దీంతో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. ఎగువ ప్రాంతాలైన దారగడ్డ, గుర్తేడు, పాటకోట పంచాయతీలలోని గిరిజన గ్రామాల ప్రజలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రజలు వైద్య సేవలకు, నిత్యవసరాల పనుల నిమిత్తం రావాలంటే తీవ్ర అవస్థలు పడుతున్నారు. వర్షం, ఈదురుగాలులు అధికంగా ఉండడంతో రెండు రోజులుగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఈ వర్షాల దాటికి కొండపోడు పంటలైన కంది, సామ, కొర్ర, రాగులు నేల పాలవుతున్నాయని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు. వర్షాల నేపథ్యంలో మారేడుమిల్లి సిఐ రుద్రరాజు భీమరాజు, ఎస్సై రాము నాయుడు, గుర్తేడు ఎస్సై సాయికుమార్ వాగులను దాట వద్దంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

మారేడుమిల్లి మండలంలో ఉప్పొంగిన గెడ్డవాగు

రాజవొమ్మంగి : శనివారం రాత్రి నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని జడ్డంగి, మడేరు, కింద్ర పెద్దేరు, ఒట్టిగడ్డ, గింజర్తి, నెల్లిమెట్ల వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. కొండవాగుల సైతం పొంగి పోర్లుతున్నాయి. భారీ వర్షాలు నేపథ్యంలో ఏజెన్సీ రహదారులు జలమయమయ్యాయి. భారీ వర్షాలకు మన్యం వాసులు ఇళ్లకే పరిమితమయ్యారు. ప్రజలు ప్రమాదకర వాగులు దాటవద్దని రాజవొమ్మంగి సీఐ ఎన్ సన్యాసినాయుడు తెలిపారు.

ఇళ్లల్లోకి వర్షపునీరు

అడ్డతీగల : ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు మండల కేంద్రంలో డొక్కపాలెం, అల్లూరి సీతారామరాజు కాలనీ పరిసర ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగాయి. పుష్పరాజ్ చర్చి ఏరియాలో లింగం పెద్దకాపు ఇంట్లోకి వర్షపు నీరు చేరింది. దీంతో వారు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. ఏలేరు వాగు పొంగి ప్రవహిస్తున్నంతో మద్దిగడ్డ రిజర్వాయర్ రెండు గేట్లు ఎత్తి వరద నీటిని దిగు ప్రాంతాలకు విడిచిపెట్టారు. పోలీస్, రెవెన్యూ అధికారులు పరివాహ ప్రాంతాల్లో గస్తీ కాస్తూ ఎవరిని వాగులు దాటి రావద్దని హెచ్చరిస్తున్నారు.

వై.రామవరం : శనివారం రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో చింతకరపాలెం, బండిగడ్డ, యార్లగడ్డ, పి ఎర్రగొండ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. రాబోవు మూడు రోజులలో భారీ, అతి భారీ వర్షాలు పడే అవకాశాలు ఉన్నందున వాగులు దాటే ప్రయత్నం చేయొద్దని పోలీసు సిబ్బంది హెచ్చరిస్తున్నారు. సహాయ చర్యలు ఏర్పాటు చేశామని ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.

కొట్టుకుపోయిన కల్వర్టు

అనంతగిరి : మండలంలో తుఫాను ప్రభవంతో కల్వర్టులు దెబ్బతినడంతో జనజీవనం స్తంభించింది. గత నాలుగు రోజులుగా ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న కుండపోత వర్షాలకు మారుమూల పిన్నకొట, పెదకొట, కివర్ల పంచాయతీల పరిధి 20 గ్రామాలకు ఆనుకుని రింగ్ రోడ్డు వద్ద ఉన్న కల్వర్టు వరదకు కొటుకుపోయింది. చీడిమెటు, పూతికపుటులో కల్వర్టు పూర్తిగా కొట్టుకు పోవడంతో చీడిమెట్టు, బోనురు, బొర్రాపాలేం, సటకంభ, బోనురు, గడ్డిబంద, జగడలమామిడి, టెంకలబందతో పాటు పలు గ్రామాలకు పూర్తిగా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ గ్రామాలకు అంబులెన్స్, ఇతర వాహనాలు వెళ్లలేని పరిస్థితితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

డుంబ్రిగుడ : అల్పపీడనంతో మండలంలో ఆదివారం భారీ ఎడతెరిపిలేని వర్షం కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు భారీ వర్షం కురిసింది. ఈ భారీ వర్షం కారణంగా వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. చాపరాయి జలపాతం గెడ్డ పొంగి ప్రవహిస్తుండటంతో ఆదివారం పర్యాటకుల ప్రవేశాలను అధికారులు నిలుపుదల చేశారు. ఏకధాటిగా వర్షం కురుస్తుండటంతో వివిధ పనుల నిమిత్తము బయటకెళ్ల లేక నివాస గృహాలకే గిరిజనులు మరిమితమయ్యారు.

హుకుంపేట : మండలంలోని జర్రకొండ పంచాయతీ పరిసర ప్రాంతాల్లో వరద ప్రవాహంతో ఆవులు, మేకలను అడవి నుంచి గ్రామాలకు చేరేందుకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షపు నీరు ఉదృతంగా ప్రవహిస్తుండటంతో మేతకు వెళ్లిన ఆవులు, మేకలు గెడ్డకు కొట్టుకుపోతూ ఒడ్డుకు ఇరువైపులా చేరే పరిస్థితి ఏర్పడింది. సరియా నుంచి గనిక ఊరు దగ్గర లో గెడ్డ ఉండటంతో రాకపొకలు ఇబ్బంది పడుతున్నారు. ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నీరు ఉదృతంగా ప్రవహిస్తుంది.

అడ్డతీగలలో ఇంట్లోకి చేరిన నీరు

జి.మాడుగుల: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో ఆదివారం ఉదయం తెల్లవారుజాము నుంచే ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. మండల కేంద్రంలో డ్రైనేజీ కాలువలు సరిగా లేక రోడ్డుపైనే నీళ్ల ప్రవహిస్తున్నాయి. దీంతో, వాహనదారులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. బొయితిలి పంచాయితీ సూరిమెట్ట గ్రామ సమీపంలో బ్రిడ్జి పైనుంచి నీరు ప్రవహించింది. రాస వీధి గ్రామ సమీపంలో తాత్కాలికంగా నిర్మించిన కలవర్టు కొట్టుకుపోయే పరిస్థితి ఏర్పడింది. బోయతిలి గ్రామంలో పంట పొలాలు పూర్తిగా నీటిమునిగాయి.

పాడేరు : జిల్లాలో ఆదివారం విస్తారంగా వర్షాలు కురిశాయి. వాగులు గెడ్డలు పొంగి పారు తున్నాయి. చింతపల్లి మండలం చదలవాడ పంచాయతీలో రెండు హేబిటేషన్లు వరద ప్రభావం పడింది. ఎర్రగుంట గ్రామంలో 30 నివాసాలు ఉన్నాయి. రెండు ఇల్లు పూసవాకు పక్కన ఉండడంతో నీటి ముంపు గురైంది. వారిని సురక్షిత ప్రాంతంలో ఉన్న బంధువుల ఇళ్లకు తరలించారు. జీకే వీధి మండలం చామగడ్డ ప్రధాన రహదారిలోని వంతెన కొట్టుకుపోయింది. 30 గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వి .అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ వర్ష ప్రభావాలను పర్యవేక్షిస్తున్నారు. సబ్ కలెక్టర్ హుకుంపేట మండలంలోని చీడిపుట్టు గెడ్డ ను సందర్శించి అక్కడ పరిస్థితిని పరిశీలించారు.

తగ్గిన గోదావరి, శబరి వరద ఉధృతి

చింతూరు : గోదావరి, శబరి నదుల్లో వరద ఉధృతి తగ్గింది. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం ఆదివారం సాయంత్రానికి 40 అడుగులకు చేరి ప్రమాద స్థాయి నుండి కిందకు ప్రవహిస్తోంది. శబరి, గోదావరి నదుల వరద ఉధృతి తగ్గడంతో రహదారుల్లో రాకపోకలు పునరుద్ధరించబడ్డాయి. సోకులేరు వాగు పూర్తిగా తగ్గడంతో చింతూరు, విఆర్.పురం రెండు మండలాలకు రవాణా సౌకర్యం కొనసాగుతోంది. కోయగూరు వద్ద వాగు ప్రవాహం తగ్గటంతో ఆంధ్రా, ఒడిస్సా, చత్తీస్‌ఘడ్, తెలంగాణలకు రాకపోకలు సాగుతున్నాయి. మరో వైపు తుఫాను కారణంగా చింతూరు ఏజెన్సీ ప్రాంతంలో ముసురు అలుముకుంది. రాత్రి పిడుగులు పడడంతో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు రెండు మరమ్మతులకు గురికాగా కొంతమేర విద్యుత్ అంతరాయం ఏర్పడింది. అధికారుల వెంటనే విద్యుత్ పునరుద్ధరణ చేశారు.

విఆర్.పురం : మండలంలో రహదారులన్నీ వరద నుండి బయటపడటంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. అయితే శుక్రవారం సాయంత్రం నుండి ఆదివారం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో మళ్ళీ గోదావరి వస్తుందేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

అల్లూరి జిల్లాలో వర్ష పాతం

పాడేరు : జిల్లాలోని వై.రామవరం మండలంలో అత్యధికంగా 74.2 ఎంఎం వర్షపాతం నమోదయింది. అత్యల్పంగా విఆర్ పురం మండలంలో 7.6 ఎం.ఎం. వర్షపాతం నమోదయింది. ముంచంగిపుట్టులో 72.6 పెదబయలులో 46.2, డుంబ్రిగూడ 35.4, అరకు వ్యాలీ 22.4, అనంతగిరి 13.8, హుకుంపేట 33.2, పాడేరు 33.4, జి మాడుగుల 20.2, చింతపల్లి 47.4, జీకే వీధి 35.2, కొయ్యూరు 20.8, మారేడుమిల్లి 38.6, దేవీపట్నం 27.6, వై.రామవరం 74. 2, అడ్డతీగల 69.4, రాజవొమ్మంగి 53.0, గంగవరం 68.2, రంపచోడవరం 32.4, ఎటపాక 15.2, కూనవరం 13.4, చింతూరు 9.6, వి ఆర్ పురం 7.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.

జి.మాడుగులో ప్రవహిస్తున్న గెడ్డ

10న రాస్తారోకోలను జయప్రదం చేయండి

సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

ప్రజాశక్తి- అరకులోయ రూరల్:బిజెపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ పరిస్థితి మరింత ఆందోళనకరంగా తయారైందని రోజు రోజుకీ పరిస్థితి దిగజారుతుందని సిఐటియు అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి వి.ఉమామహేశ్వరరావు తెలిపారు. అరకులోయలో ఆయన ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, విశాఖ స్టీల్ ప్లాంట్ ను కాపాడుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 10వ తేదీన సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాస్తారోకోలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.విశాఖ స్టీల్ ఉత్పత్తి సామర్థ్యం సాలీనా 73 లక్షల టన్నులు ఉండగా గత సంవత్సరం 45 లక్షల టన్నులు మాత్రమే ఉత్పత్తి చేశారని, ఈ ఏడాది ఇంకా తగ్గిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విశాఖ స్టీల్ దేశంలోనే నాణ్యమైందని, కావాలనే ఉత్పత్తిని బీజేపీ ప్రభుత్వం తగ్గించి నష్టాల్లోకి నెట్టి ప్రైవేట్‌కు అప్పగించాలని కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఈ స్టీల్‌ప్లాంట్‌కు రైతులు 20 వేల ఎకరాల భూములిచ్చారని, 32 మంది ప్రాణాల బలిదానంతో సాధించుకున్నారని గుర్తు చేశారు. ఇప్పటికైనా టీడీపీ నాయకత్వం కేంద్ర బీజేపీ పై ఒత్తిడి తెచ్చి విశాఖ స్టీల్ ను కాపాడాలని కోరారు. అన్ని ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు ఈ రాస్తారోకోలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

ప్రజాశక్తి-పాడేరు:జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున ఈనెల 9న సోమవారం అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు సెలవు ప్రకటిస్తూ జిల్లా కలెక్టర్ ఏ ఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఎయిడెడ్ పాఠశాలలకు, కళాశాలలకు, అంగన్వాడీ కేంద్రాలకు శెలవు దినముగా ప్రకటిస్తున్నట్లు తెలియజేశారు. ప్రైవేట్ విద్యాసంస్థలు కూడా విధిగా సెలవు ఇవ్వాలని, ఎటువంటి తరగతులు నిర్వహించరాదని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు సెలవును గమనించి పిల్లలను పాఠశాలకు పంపించరాదని సూచించారు. ఎట్టి పరిస్థితులలోనూ పిల్లలు వాగులు గడ్డలు దాటరాదని సూచించారు.

ఘాట్ రోడ్లలో వాహనాల రాకపోకలు నిషేధం

ప్రజాశక్తి-పాడేరు: జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కొండ చరియలు విరిగిపడే అవకాశం ఉన్నందున ఘాట్ రోడ్లలో వాహనాల రాకపోకలు నిషేధిస్తూ జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా నర్సీపట్నం -సీలేరు ఘాట్ రోడ్, వడ్డాది. పాడేరు ఘాట్ రోడ్, అరకు అనంతగిరి ఘాట్ రోడ్, రంపచోడవరం మారేడుమిల్లి, చింతూరు ఘాట్ రోడ్ లలో వాహనాల రాకపోకలు నిషేధించామన్నారు. వాహనాలు ఘాట్ రోడ్లలో రాకపోకలు సాగించకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

అసంపూర్తిగా ప్రభుత్వ భవనాలు

ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగని పనులు-అవస్థలు పడుతున్న సిబ్బంది

ప్రజాశక్తి-డుంబ్రిగుడ:గిరిజనుల సౌకర్యార్థం మండల కేంద్రంలో నిర్మిస్తున్న ప్రభుత్వ భవనాలను అసంపూర్తిగా నిర్మించి వదిలేశారు. ఏళ్లు గడుస్తున్నా పూర్తిస్థాయిలో నిర్మించక పోవడంతో నిర్మించిన గోడలు సైతం శిథిలావస్థలో చేరుకుంటున్నాయి. దీంతో, లక్షల రూపాయలు ఖర్చు పెట్టి నిర్మించిన భవనాలు సైతం ఎందుకు పనికి రాకుండా పోయే పరిస్థితి వస్తుంది.

మండల కేంద్రంలో నూతన తహసిల్దార్ కార్యాలయం భవనం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ వెల్ నెస్ సెంటర్ భవన నిర్మాణ పనులు పూర్తి కాక పోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఇక్కడి తహసిల్దార్ కార్యాలయానికి సంబంధించి సొంత భవనం లేక పోవడంతో మొదటి నుంచి అటవీ శాఖ కార్యాలయానికి చెందిన భవనంలో కార్యాలయ నిర్వహణ సాగిస్తున్నారు. సొంత కార్యాలయ భవనం నిర్మించడానికి గత నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించారు. ఈ భవనం నిర్మాణ పనులు రెండు అంతస్థులు వరకు శ్లాబ్ దశ వరకు నిర్మించి ప్లాస్టింగ్ చేయకుండా వదిలేశారు. రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ సెంటర్ భవనాన్ని కూడా గత రెండేళ్ల క్రితం పిల్లర్స్ వేసి స్లాబ్ దశ వరకు నిర్మించి ఇప్పటివరకు పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారు. ఈ భవనం నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోయి సుమారు మూడేళ్లు గడుస్తుంది. అయినా ఇప్పటికి పనులు పూర్తి కాలేదని గిరిజనులు తెలిపారు. తహసిల్దార్ కార్యాలయ సిబ్బందికి పూర్తిస్థాయిలో భవన సౌకర్యం లేక నిర్వహణకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని పలువురు సిబ్బంది తెలిపారు. ప్రస్తుతం ప్రధానంగా ఉన్నతాధికారులతో మండల స్థాయి అధికారులకు టెలికాన్ఫరెన్స్ లేక వీడియో కాన్ఫరెన్స్ కచ్చితంగా జరుగుతుంది. దీంతో, తహసిల్దార్ కార్యాలయంలో ఉద్యోగులకు సరిపడే సమావేశ భవనం లేక పోవడంతో కొంతమంది ఉద్యోగులు బయట నిల్చోవలసిన పరిస్థితి ఏర్పడుతుందని పలువురు ఉద్యోగులు తెలిపారు. నూతనంగా నిర్మిస్తున్న కార్యాలయ భవనం పూర్తిగా నిర్మించినట్లయితే రెవెన్యూ సిబ్బందితో పాటు మండల ఉద్యోగులకు కూడా సమావేశాలు జరుపుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందని ఉద్యోగులు అంటున్నారు. తక్షణమే ఉన్నత స్థాయి అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న తహసిల్దార్ కార్యాల భవనాన్ని పూర్తిగా నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

అసంపూర్తిగా ఉన్న వెల్‌నెస్ భవనం

అసంపూర్తిగా ఉన్న తహశీల్దార్ కార్యాలయ భవనం

త్వరితగతిన తాత్కాలిక డైవర్షన్ రోడ్డు పనులు

ప్రజాశక్తి- కోటవురట్ల:రామచంద్రపురం వద్ద బ్రిటిష్ కాలంలో నిర్మించిన మైనర్ వంతెన జీర్ణావస్థకు చేరుకొని కృంగి పోవడంతో ఆదివారం రహదారులు భవనాల శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్ వంతెనను పరిశీలించారు. భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయాలంటూ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే వంతెన నిర్మాణానికి అంచనాలను రూపొందించామని రెండు కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు. అదేవిధంగా ప్రస్తుతం తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డు ఇచ్చేందుకు 15 లక్షలు అవుతుందని, పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టి రాకపోకలు పునరుద్ధరిస్తామని ఆయన తెలిపారు. వంతెన తీవ్రస్థాయిలో బలహీనంగా ఉందని భారీ వాహనాలను నిషేధించడంతోపాటు రెండు రోజులపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడ నున్నందున సమీపప్రాంత ప్రజలు సహకరించాలని కోరారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా స్థానిక ఎస్సై రమణయ్య సిబ్బందిని అప్రమత్తం చేశారు. ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు.

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులుగా సుబ్బన్న

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నర్సీపట్నంకి చెందిన మీసాల సుబ్బన్నను నియమిస్తూ అఖిలభారత కాంగ్రెస్ కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ ఈ మేరకు ఉత్తర్వులు విడుదల చేశారు. సుబ్బన్న గతంలో డిసిసి అధ్యక్షునిగా పనిచేశారు. మరల ఆయనకు అవకాశం కల్పించడం పట్టణ పిసిసి నాయకులు, కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేశారు.

ఫ్లూ జ్వరాలపై అప్రమత్తత కీలకం

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : ప్రస్తుతం విస్తరిస్తున్న ఫ్లూ జ్వరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని స్థానిక వైయస్సార్ హాస్పిటల్ చిన్నపిల్లల వైద్యనిపుణులు శ్రీకాంత్ సూచించారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ సీజన్లో ఫ్లూ జ్వరం ఎక్కువగా విస్తరిస్తుందని, నర్సీపట్నం పరిసర ప్రాంత చిన్న పిల్లల్లో ఎక్కువగా ఈ జ్వరాలు కనబడుతున్నాయని తెలిపారు. నోటు నుండి తుమ్మినప్పుడు ఫ్లూ కారకం వ్యాప్తి చెంది ఫ్లూ జ్వరం వ్యాప్తికి దారితీస్తుందని, మాస్క్ ధరించాలని ఆయన అన్నారు. జ్వరం 102 నుండి 103 డిగ్రీల వరకు జ్వరం ఉంటుందని, రొంప, గొంతు నొప్పి, వాంతులు, విరోచనాలు లక్షణాలు కనిపిస్తాయన్నారు. ఏడాదిలోపు నుండి ఐదు సంవత్సరాలు పైబడిన వారు, పెద్దలకు కూడా ఫ్లూ జ్వరం వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. తినేటప్పుడు చేతులు శుభ్రం చేసుకుని తినాలన్నారు. ముందుగా టీకాలు వేయించుకోవడం మంచిదని సూచించారు.

గరికిపాటి రాజారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - ఆరిలోవ : ప్రజానాట్యమండలి వ్యవస్థాపకులు గరికిపాటి రాజారావు 61వ వర్ధంతిని ఆరిలోవ బిఎన్ఆర్‌నగర్‌లో ప్రజానాట్యమండలి ఆధ్వర్యాన ఆదివారం నిర్వహించారు. ముందుగా రాజారావు చిత్రపటానికి ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు వై.అప్పారావు, సూర్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వక్తలు వై.అప్పారావు, సూర్యనారాయణ, చంటి, వి.నరేంద్రకుమార్ మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాట కాలం నుంచి ప్రజా సమస్యల పట్ల అవగాహన కల్పిస్తూ, ప్రజల్లో చైతన్యం కలిగించే అనేక కళారూపాలు నిర్మించారని కొనియాడారు. ఒకవైపు వైద్యునిగా సేవలందిస్తూ మరో వైపు సమాజానికి పట్టిన రుగ్మతులకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారని తెలిపారు. భూమి నాటకం ద్వారా ప్రజలు, కార్మిక, రైతాంగ వర్గాల్లో చైతన్యాన్ని తీసుకొచ్చారన్నారు. ఎంతో మందిని సినీ రంగానికి పరిచయం చేశారని గుర్తుచేశారు. ఇటువంటి మహనీయుల బాటలో మనమందరం నడవాలని విజ్ఞప్తి చేశారు.

వరద బాధితులకు నిత్యావసరాలు

ప్రజాశక్తి-సీతమ్మధార విజయవాడ వరద బాధితుల సహాయం నిమిత్తం వైజాగ్, విజయనగరం బ్రాంచ్ విద్యుత్ అధికారులు బియ్యం, పప్పు, ఆయిల్, బిస్కెట్లు, నిత్యావసర వస్తువులను అందజేసినట్లు సంస్థ ప్రతినిధి ఎడిఇ కోటేశ్వరరావు తెలిపారు. మొత్తం 1400 ప్యాకెట్లు అందజేసినట్లు చెప్పారు.

జూడో పోటీలకు విద్యార్థులు

ప్రజాశక్తి-ఆనందపురం : చెన్నైలో ఈ నెల 10 నుంచి 13వ తేదీ వరకు జరగబోయే జూడో పోటీలకు ఆనందపురం మండలం శొంఠ్యాం గ్రామంలోని శ్రీ వెంకట విద్యాపీట్ విద్యార్థులు ఆదివారం బయలుదేరారు. ఇటీవల రాష్ట్ర జూడో క్రీడా సంఘం సెలక్షన్ కమిటీ చైర్మన్ డాక్టర్ పాండ్రంకి రుఖ్మాకరరావు ఆధ్వర్యాన ఖేలో ఇండియా సౌత్ జోన్ జూడో చాంపియన్ షిప్ బాలికల ఎంపికలు నిర్వహించారు. చెన్నైలో జరిగే పోటీలకు బయలుదేరిన విద్యార్థులకు శ్రీ వెంకట్ విద్యా పీఠ్ చైర్మన్ అండ్ డైరెక్టర్ రొంగలి వెంకటేశ్వరరావు, చీఫ్ కోచ్ లెంక అప్పలరాము అభినందనలు తెలిపారు.

సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో లక్ష్మికి డాక్టరేట్

ప్రజాశక్తి-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగం పరిశోధకులు ఎం.లక్ష్మికి డాక్టరేట్ లభించింది. విభాగాధిపతి ఆచార్య సిఎన్‌వి సత్యనారాయణరెడ్డి పర్యవేక్షణలో జరిపిన పరిశోధనకు డాక్టరేట్ అందుకున్నారు. గుజరాత్ రాష్ట్రంలోని 22 బ్రిడ్జిల వద్ద 44 బోర్ హోల్స్ నుంచి మట్టి నమూనాలను సేకరించి ప్రయోగశాలలో అధ్యయనం చేసి మట్టి దృఢత్వాలను గుర్తించారు. భూమి లోపల 30 మీటర్ల లోతులో మట్టి నమూనాలను ఎస్‌పిటి పరీక్ష జరిపి సేకరించి, విశ్లేషించి మట్టి దృఢత్వాన్ని, ఎస్‌పిటి పరీక్షల మధ్య సంబంధాన్ని అధ్యయనం చేశారు. ఈమె పరిశోధన అంతర్జాతీయ జర్నల్‌లో ప్రచురించడంతోపాటు భారతదేశ పేటెంట్ కార్యాలయం నుంచి 2 పేటెంట్లు కూడా లభించాయి. ఈ సందర్భంగా లక్ష్మిని విభాగ ఆచార్యులు పరిశోధకులు అభినందించారు.

అసంపూర్తి భవనంలోనే విద్యార్థుల చదువులు!

పదేళ్లయినా పూర్తికాని పాఠశాల భవన పనులు
పట్టించుకోని అధికారులు,ప్రజాప్రతినిధులు

పూర్తికాని భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్:అరకులోయ మండలం లోతేరు పంచాయతీ పరిధిలోని తోటవలస మండల పరిషత్ పాఠశాల నిర్వహణ అసంపూర్తి భవనంలోనే విద్యాబోధన సాగుతుంది. దీంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షానికి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పాఠశాలలో సుమారు 14 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. గతంతో 2012 - 2013 సంవత్సరంలో సర్వ శిక్షా అభియాన్ నిధులతో 15 లక్షలు మంజూరు అయ్యాయి. అయినా భవనం అసంపూర్తిగా ఉందని గ్రామస్తులు తెలిపారు.పదేళ్లు గడుస్తున్నా పాఠశాల భవన నిర్మాణం పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులు అందులోనే విద్యనభ్యసిస్తున్నారు. దీంతో, ఎప్పుడు ఎలా ఉంటుం దోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అసంపూర్తి భవనం కావడంతో వర్షం వస్తే కారిపోతుంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతూ చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఎక్కువ వర్షం వస్తే కూర్చొని చదువుకోవడానికి కూడా వీలు లేదని,సెలవు ప్రకటించడం తప్ప మరో మార్గం లేదని గ్రామస్తులు తెలిపారు. దీనిపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్ని సార్లు పిర్యాదు చేసినా పట్టించుకోలేదని విద్యార్థుల తల్లిదండ్రులు చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తోటవలస గ్రామంలో పాఠశాల భవనం పూర్తిగా నిర్మించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

గిరిజనులు అప్రమత్తంగా ఉండాలి

-సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్
-చీడిపుట్టు వంతెన పరిశీలన

చీడిపుట్టు వంతెనను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

ప్రజాశక్తి హుకుంపేట: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్ స్పష్టం చేశారు. మండలంలోని చీడిపుట్టు వంతెనను ఆదివారం సందర్శించారు. చీడుపుట్టు వంతెన పై రాకపోకులను నిలుపుదల చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మరో 24 గంటలు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రజలు ఈ రహదారి మీదుగా రాకుండా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు.ఈ కార్యక్రమంలో పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డుంబ్రిగుడ:వాయుగుండం కారణంగా కురుస్తున్న జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో గిరిజన ప్రజానీకం అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ సిహెచ్ నాగమ్మ సూచించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వాగులు, గెడ్డల ఉధృతి అధికంగా ఉందన్నారు. వాగులు, గెడ్డలు దాటకుండా గ్రామాల్లోనే సురక్షితంగా ఉండాలన్నారు. పంచాయతీల వారిగా విర్ఒలను, సిబ్బందిని అందుబాటులో ఉంచామన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ను ఏర్పాటు చేసి 24 గంటలపాటు సిబ్బంది ఇందుబాటులో ఉంచామన్నారు. పంట నష్టాలు, ఆస్తి నష్టం జరిగితే ఆర్ఐను సంప్రదించాలని ఆమె పేర్కొన్నారు.

'సురా' సాహిత్య సేవా పురస్కారాలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రముఖ సంఘసేవకుడు, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక సభ్యుడు, 'సురా' బాబాయ్ (పేరిచర్ల సుబ్బరాజు) పేరుతో నెలకొల్పబడిన 'సురా సాహిత్య సామాజిక సేవా పురస్కార కార్యక్రమం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెక్టు చైర్‌పర్సన్ గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ, కుల, మత వ్యత్యాసాలకు, సామాజిక రుగ్మతాలకు, చేతబడి, బాణామతి, వాస్తు, జ్యోతిష్యం తదితర మూఢ విశ్వాసాల నిర్మూలనపై పోరాడిన మానవతావాది సురా బాబాయ్ అని కొనియాడారు. 'మరణించినా... జీవించండి' అన్న నినాదంతో ప్రారంభించిన శరీర అవయవదాతల సంఘానికి వ్యవస్థాపక సభ్యుడుగా ఎనలేని సేవలు అందించిన గొప్ప నాయకుడు అన్నారు. ఆయన స్ఫూర్తి చరిత్రలో చిరస్మరణీయం అయ్యేందుకు 'సురా సాహిత్య సామాజిక సేవా పురస్కారాన్ని' వారి కుటుంబం నెలకొల్పిందని వివరించారు. సమాజంలో వివిధ రంగాలలో నిస్వార్ధ సేవలు అందిస్తున్న వారికి ఏటా సెప్టెంబర్ నెలలో ఈ స్మారక అవార్డుతోపాటు రూ.25వేల నగదు పురస్కారం అందజేస్తున్నారు. ఈ ఏడాది అవార్డును తెలంగాణ రాష్ట్ర శరీర అవయవ దాతల సంఘం అధ్యక్షులు కాట్రగడ్డ భారతికి అందజేసినట్లు గూడూరు సీతామహాలక్ష్మి తెలిపారు.

అవార్డు స్వీరించిన ప్రముఖులు

2019లో ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహ్మద్, 2020లో ప్రముఖ ప్రజావాగ్గేయకారుడు డప్పు రమేష్, 2021లో ప్రముఖ సాహిత్య - సామాజికవేత్త అనిశెట్టి రజిత, 2022లో ప్రముఖ సంఘ సేవకులు 'బొమ్మరిల్లు', 'జాబిల్లి' ఆశ్రమ నిర్వాహకులు పి.రాజ్యలక్ష్మి, 2023లో ప్రముఖ రక్తదాన ఉద్యమకారుడు, 999 రక్తదాన క్యాంపులు, 70 వేలకు పైగా యూనిట్ల రక్తాన్ని సేకరించిన వి.వినోద్‌బాబుకు అందజేశారు.

నేరాలు ఘోరాలు

చోరీకి పాల్పడిన మహిళ అరెస్ట్

ప్రజాశక్తి -మధురవాడ : పిఎం.పాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగ్ నుంచి చోరీకి పాల్పడిన మరో మహిళను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు నేరవిభాగపు ఎసిపి వెంకటరావు తెలిపారు. ఆదివారం పిఎం.పాలెం స్టేషన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. నర్సీపట్నం ప్రాంతానికి చెందిన ఎం.సీతారామలక్ష్మి ఈనెల 6వ తేదీన ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి పిఎం పాలెం వచ్చేందుకు ఆటో ఎక్కారు. అప్పటికే ఆటోలో ముగ్గురు మహిళలు ప్రయాణిస్తున్నారు. సీతారామహాలక్ష్మి బ్యాగ్‌లో అరున్నర తులాలు బంగారంతో పాటు రూ.50 వేలు నగదు ఉన్నాయి. ఆ ఆటోలో ఉన్న మాడుగులకు చెందిన గాది సత్యవతి బ్యాగులోని వస్తువులను దొంగిలించి ఆటో దిగిపోయింది. సీతారామలక్ష్మి ఇంటికి వచ్చి చూసేసరికి వస్తువులు లేకపోవడంతో పిఎంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు సిసి కెమెరాలను పరిశీలించారు. వాటి ఆధారంగా నిందితురాలు సత్యవతిని అరెస్ట్ చేశారు. వస్తువులను స్వాధీనం చేసుకొని, అరెస్ట్ చేశారు. నిందితురాలు సత్యవతిపై గతంలో అనకాపల్లిలో అనేక కేసులు ఉన్నట్లు ఎసిపి తెలిపారు. ఈ సమావేశంలో నేర విభాగం సిఐ బిఎస్-ఎస్.ప్రకాష్, ఎస్ఐ డి.ప్రసాద్, హెచ్‌సి మూర్తి, హసీనా బేగం, నాగరాజు, మల్లిక్, వైభవ్ పాల్గొన్నారు.

చోరీ కేసులో యువకుడు అరెస్ట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 3న ద్వారకా క్రైమ్ సబ్ డివిజన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసును పోలీసులు ఛేధించారు. ఆ కేసు వివరాలను ఈస్ట్ ఎసిపి వెంకటరావు ఎంవిపి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వెల్లడించారు. సీతమ్మధార సమీపంలోని ఎపిఎస్ఇబి కాలనీలో ఉంటున్న కొండ్రు ఉదయలక్ష్మి ఏసీ రిపేర్ నిమిత్తం పూర్ణా మార్కెట్ రంగిరీజు వీధికి చెందిన నందవరపు చాణక్యను సంప్రదించింది. సరిగ్గా ఆమె లేనిసమయంలో చాణక్య ఆ ఇంటికి వెళ్లాడు. తన వద్ద ఉన్న స్క్రూ డ్రైవరుతో తలుపు విరగ్గొట్టాడు. అక్కడ ఉన్న ట్రావెల్ బ్యాగ్ జిప్ ఓపెన్ చేసి అందులో ఉన్న బంగారు వస్తువులు దొంగిలించాడు. అదే రోజున ఎంవిపి క్రైమ్ పోలీసుస్టేషన్‌లో ఉదయలక్ష్మి ఫిర్యాదు చేసింది. చాణక్యను పోలీసులు తమదైన పద్ధతిలో విచారించారు. దీంతో అసలు విషయం బయటపడింది. అతని వద్దనున్న సుమారు రూ.2 లక్షలా 12 వేల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితున్ని రిమాండ్‌కు పంపించారు. ముద్దాయి రుషికొండ దగ్గరగల గాయత్రి కాలేజ్‌లో ఎంబిఎ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. మీడియా సమావేశంలో డివిజన్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసరావు, ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

బైక్‌లు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి -కొత్తకోట:రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరు మృతి చెందగా మరో ఇరువురికి తీవ్ర గాయాలైన సంఘటన రావికమతం మండలం మత్సవానిపాలెం గ్రామ సమీపంలో మొదమాంబ కాటా వద్ద శనివారం రాత్రి చోటు చేసుకుంది. టి.అర్జాపురం గ్రామానికి చెందిన అద్దిపల్లి రామరాజు, మచ్చా రాము నాయుడులు ద్విచక్ర వాహనంపై కొత్తకోట నుండి అర్జా పురం వెళుతుండగా ఇదే గ్రామానికి చెందిన కోసిరెడ్డి సువర్ణ రాజు మరో వాహనం పై ఎదురుగా వస్తూ ఒకరినొకరు బలంగా ఢీ కొట్టుకున్నారు. ఈ ఘటనలో అద్దిపల్లి రామరాజు కు బలమైన గాయాలు కాగా ఆయన వెనుక ఉన్న మచ్చా రామానాయుడు, సువర్ణ రాజులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల సహకారంతో ముగ్గురిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అద్దిపల్లి రామరాజు పరిస్థితి విషమంగా ఉండటంతో అనకాపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. రామరాజు మృతదేహానికి పోస్ట్ మార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్లు సీజ్

ప్రజాశక్తి -నక్కపల్లి:ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని సిఐ కుమారస్వామి, ఎస్ఐ సన్ని బాబు హెచ్చరించారు. మండలంలోని గునిపూడి శివారులో ఆదివారం అక్రమంగా రవాణా చేస్తున్న 2 ఇసుక ట్రాక్టర్లను సీజ్ చేసి జరిమానా విధించారు. మండలంలో అడ్డుఅదుపు లేకుండా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబు ఉక్కు పాదం మోపుతున్నారు. ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు ముమ్మరంగా దాడులు నిర్వహిస్తున్నారు.ఈ నేపథ్యంలో ఇప్పటికే రెండు పర్యాయాలు దాడులు నిర్వహించి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 4 టిప్పర్లు ,జెసిబిని సీజ్ చేసి జరిమానా విధించారు. అయినప్పటికీ తీర ప్రాంతాల్లో ఇసుకను అక్రమంగా ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయాలు జరుపుతున్నారు.ఈ సందర్భంగా సిఐ, ఎస్ ఐ మాట్లాడుతూ, ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం నిఘా ఉంటుందన్నారు.

డొంకరాయి నుంచి విడుదలవుతున్న నీరు

డొంకరాయి నుండి 8,800 క్యూసెక్కుల నీరు విడుదల

ప్రజాశక్తి-సీలేరు : తుఫాన్ కారణంగా గత మూడు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరద నీరు డొంకరాయి జలాశయంలో చేరి ప్రమాద స్థాయికి చేరింది. దీంతో ఏపీ జెన్కో అధికారులు అప్రమత్తమై డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా దిగు ప్రాంతానికి 8800 క్యూసెక్కుల నీటిన విడుదల చేశారు. డొంకరాయి జలాశయం నీటిమట్టం 1037 అడుగులు కాగా ప్రస్తుతం 1036.70 అడుగుల నీటిమట్టానికి చేరుకుంది.

ఎగుప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు నుంచి డొంకరాయి జలాశయంలో రోజుకు 9600 క్యూసెక్కుల చేరుతుందని గుర్తించిన 8800 క్యూసెక్కులు నీటిని దిగు ప్రాంతానికి విడుదల చేస్తున్నట్లు జెన్కో అధికారులు తెలిపారు. డొంకాయి పవర్ కెనాల్ ద్వారా పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం 3800 నీటిని రోజువారీగా విడుదల చేస్తున్నట్లు తెలిపారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలో సీలేరు, డొంకరాయి, పొల్లూరు, జల విద్యుత్ కేంద్రాల్లో గ్రిడ్ ఆదేశాలకనుగుణంగా విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుందని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-రంపచోడవరం : రాజమండ్రి రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యాన ఆదివారం మండల కేంద్రంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు టి.వి.సుబ్బరావు, రాయుడు శ్రీనివాస్, దాసరి ఉమామహేష్, ఎస్.సంపత్ కుమార్ సుమారు 150మందికి వైద్య సేవలు అందించారు. వైద్య శిబిరంలో అవసరమైన వారికి 64 మందికి రక్తపరీక్షలు, ముగ్గురికి ఫిజియథెరపీ, ఐదుగురికి ఎక్స్‌రేలు చేసినట్లు రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. రోగులకు, సహాయకులకు భోజన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ శిబిరంలో క్యాంప్ కో- ఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు, సిబ్బంది పాగ్గొన్నారు.

సిఐగా గోపాలకృష్ణ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - మారేడుమిల్లి : మారేడుమిల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సిహెచ్ గోపాలకృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత సిఐ రుద్రరాజు భీమరాజు పి గన్నవరం బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా నూతన సీఐ గోపాలకృష్ణ మాట్లాడుతూ మన్యంలో గంజాయిపై ఉక్కుపాదం మోపుతామని చెప్పారు. యువత మత్తు పదార్థాలు జోలికి వెళ్ళరాదని సూచించారు. ప్రస్తుత తుఫాన్ నేపథ్యంలో గిరిజన ప్రాంతంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలన్నారు. ఘాట్ రోడ్డులో రాకపోకలను నిషేధించినట్లు ఆయన తెలిపారు. మారేడుమిల్లి పర్యాటక ప్రాంతాలకు పర్యాటకులను నిషేధించినట్లు పేర్కొన్నారు.

నేడు పబ్లిక్ గ్రీవెన్స్ రద్దు

ప్రజాశక్తి-రంపచోడవరం : సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను భారీ వర్షాల కారణంగా ఈ వారం రద్దు చేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి కట్ట సింహాచలం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల వలన ఏమైనా సమస్యలుంటే దగ్గర్లో ఉన్న మండల అధికారులకుగాని, ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌కిగాని తెలియజేయవచ్చని పేర్కొన్నారు. వాయుగుండం ప్రభావం వలన భారీ వర్షాలు ఉన్నందున ఎవరూ కాల్వలు దాటి రావద్దని, ఐటీడీఏ ఆఫీస్ కంట్రోల్ రూమ్‌కు 919492920383, 916303269069, 9441058467, 18004252123 ఫోన్ నెంబర్ల ద్వారా తెలియజేస్తే సత్వర పరిష్కారం చేపడతామని ఆయన వెల్లడించారు.

ప్రయాణికులకు తప్పిన పెను ప్రమాదం

అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు
రక్షించాలంటూ ప్రయాణికుల ఆర్తనాదాలు
కిటికీల్లో నుండి బయటకు తీసిన స్థానికులు

కాలువలోకి దూసుకెళ్లిన బస్సు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

మండలంలోని బొర్నగూడెం గ్రామ శివారులో ఆదివారం మధ్యాహ్నం ప్రయాణికులకు పెను ప్రమాదం తప్పింది. ఆర్టీసీ బస్సు అదుపుతప్పి కాలువలోకి దూసుకెళ్లిన సంఘటనలో డ్రైవరు కండక్టర్‌తో సహా బస్సులో ప్రయాణిస్తున్న 16 మంది గాయాలతో బయటపడ్డారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ప్రకారం.... రాజమండ్రి డిపోకి చెందిన పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు 30 మంది ప్రయాణికులతో ఆదివారం మధ్యాహ్నం రాజమండ్రి నుండి నర్సీపట్నం వెళ్తోంది. మండలంలోని బొర్నగూడెం గ్రామ శివారులోకి వచ్చేసరికి బస్సు అదుపు తప్పి ఐరన్ బ్రిడ్జిని ఢీకొని కాలువలోకి దూసుకెళ్లింది. బస్సు కాలువకు, సమీపంలోని ఒరకకూ మధ్య నిలిచి ఉండిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఆ సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులు తమను రక్షించాలంటూ ఆర్తనాదాలు మిన్నంటాయి. డోరు తెరుచుకునే అవకాశం లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర భయాందోళన చెందారు. ఈ సమయంలో అటుగా వెళుతున్న స్థానికులు, వాహనదారులు ప్రయాణికులను బస్సు అద్దాల నుంచి బయటకు తీశారు. వృద్ధులను, చిన్న పిల్లలను బయటకు తీసేందుకు శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రమాద సమయంలో అటుగా వెళుతున్న టిడిపి మండల అధ్యక్షులు, లబ్బర్తి ఎంపిటిసి గొల్లపూడి పెద్దిరాజు, టిడిపి సీనియర్ నాయకులు దంతులూరి శివరామచంద్రరాజు, మరికొంతమంది స్థానికులు, వాహనదారులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వారిని కాపాడారు. ఆర్టీసీ డ్రైవర్ అతివేగంగా నడపడం, బస్సు కుడివైపుగా లాగడం వలన ఈ ప్రమాదం జరిగిందని ప్రయాణికులు తెలిపారు. రాజవొమ్మంగి సీఐ ఎన్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది హుటా హుటిన సంఘటనా స్థలానికి చేరుకొని పర్యవేక్షించారు. 16 మంది క్షతగాత్రులను జడ్డంగి పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించారు. క్షతగాత్రుల్లో కనిగిరి గ్రామానికి చెందిన బి.మంగతాయరు, బడదనాంపల్లి గ్రామానికి చెందిన పి.రవి, జోన్నాడ గ్రామానికి చెందిన జి.కుమారి, కృష్ణదేవిపేట గ్రామానికి చెందిన పి.వరలక్ష్మి, ఎస్‌టి రాజాపురం గ్రామానికి చెందిన కె.మంగలను మెరుగైన వైద్యం కోసం ఏలేశ్వరం, రాజమండ్రి, నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు, క్షతగాత్రుల నుండి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ ఎన్ సన్యాసినాయుడు తెలిపారు.

ప్రయాణికులను ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

'ఉక్కు'ను పూర్తి సామర్థ్యంతో నడపాలి

నేటి ఢిల్లీ సమావేశంలో ఆ దిశగా నిర్ణయం తీసుకోవాలి
స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వైజాగ్ స్టీల్‌ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో నడిచేలా సోమవారం ఢిల్లీలో జరగనున్న ఉక్కు మంత్రిత్వ శాఖ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ డిమాండ్ చేశారు. ఆదివారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామితో కలిసి ఆయన మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌లో ఉత్పత్తి తగ్గించి, ప్లాంట్‌ను దెబ్బతీయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కర్మాగారంలో మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ఉండగా ఒకటి మాత్రమే పని చేసేలా చేయాలని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇది అత్యంత ప్రమాదకరమని అన్నారు. దీనిని గుర్తించి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి, పూర్తి సామర్థ్యంతో ప్లాంట్ నడిచేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. స్టీల్‌ప్లాంట్‌ను 45 రోజులలో పునరుద్ధరిస్తామని కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డి.కుమారస్వామి రెండు మాసాల క్రితం ప్లాంట్‌ను సందర్శించిన సమయంలో చెప్పారని గుర్తుచేశారు. ఆయన వెంట ఉక్కు సహాయ మంత్రి, మన రాష్ట్రానికి చెందిన శ్రీనివాస్ వర్మ కూడా ఉన్నారన్నారు. అయితే ప్రస్తుత పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయన్నారు. ప్లాంట్ అగాథంలోకి నెట్టబడుతోందన్నారు. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ద్వారా రోజుకు 21 వేల టన్నుల ఉత్పత్తి జరగాల్సి ఉండగా ప్రస్తుతం 5 వేల టన్నుల ఉత్పత్తి మాత్రమే జరుగుతోందన్నారు. గతంలో కూడా ఒక ఫర్నేస్‌ను మూసివేసి, ఉత్పత్తిని తగ్గించి ప్లాంటుకు నష్టాలు చూపిస్తూ యాజమాన్యం నివేదిక పంపిందని గుర్తు చేశారు. పనిచేయడానికి ఉద్యోగులు సిద్ధంగా ఉన్నారని, ఫర్నేష్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అందుకు బొగ్గు, ఐరన్ ఓర్ అవసరమన్నారు. ప్రభుత్వ సంస్థలైన సెయిల్, ఎన్‌ఎండిసి, కోల్ ఇండియా వద్ద బొగ్గు, ఐరన్ ఓర్ కావలసినంత ఉందన్నారు. కొంత కాలం పాటు రా మెటీరియల్‌ను ప్లాంట్‌కు సరఫరా చేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నా ఆ దిశగా కృషి చేయడం లేదన్నారు. ప్లాంట్‌ను అమ్మివేయాలన్న తలంపుతో రా మెటీరియల్‌ను సరఫరా చేసేందుకుగానీ, వర్కింగ్ క్యాపిటల్‌ను ఇచ్చేందుకుగానీ, కనీసం బ్యాంకులు నుంచి అప్పులు తీసుకునేందుకు ఎల్ఒసి (లెటర్ ఆఫ్ కంఫర్ట్) ఇచ్చేందుకుగానీ సిద్ధంగా లేదని విమర్శించారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ రాజు

అవగాహనతో ఆత్మహత్యలను నివారించవచ్చు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆత్మహత్యలకు పాల్పడే యువతను ముందుగా గుర్తించే అవకాశం బంధువులకు, ఉపాధ్యాయులకు ఉంటుందని, అటువంటి వారిని గుర్తించినప్పుడు వారికి ఆత్మహత్యలు చేసుకోవడం వల్ల జరిగే నష్టాల గురించి చెప్పడం, అవగాహన కల్పించడం ద్వారా ఆత్మహత్యలను నివారించవచ్చని ప్రముఖ మానసిక వైద్యులు డాక్టర్ ఎన్ఎన్.రాజు అన్నారు. ప్రపంచ ఆత్మహత్య నిరోధక దినం సందర్భంగా ఆదివారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ప్రజారోగ్య వేదిక ప్రధాన కార్యదర్శి టి. కామేశ్వరరావు అధ్యక్షతన ఈ సదస్సు జరిగింది. అల్లూరి విజ్ఞాన కేంద్రం, కౌసల్య కౌన్సిలింగ్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యాన ఈ కార్యక్రమం సాగింది. సదస్సులో డాక్టర్ ఎన్ఎన్.రాజు మాట్లాడుతూ ప్రతి లక్ష మందిలో 12 మంది ఆత్మహత్య చేసుకొని మరణిస్తున్నారని తెలిపారు. అవగాహనతో ఈ ఆత్మహత్యలను ఆపగలమని అన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని సైతం అరికట్టవచ్చునన్నారు. సదస్సు కెజిహెచ్ చిన్నపిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి సన్మాన కార్యక్రమంతో ప్రారంభమయ్యింది. అనంతరం ప్రముఖ స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ వైఎల్.నరసింగరావు మాట్లాడుతూ ఇటువంటి అవగాహనా సదస్సుల వల్ల ఆత్మహత్యలను నివారించగలమని చెప్పారు. పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆత్మహత్యల నివారణలో తోటి మిత్రుల సహకారం అవసరమని చెప్పారు. డివైఎఫ్ఐ నాయకులు కె.సంతోష్ కుమార్ తన అనుభవాలను పంచుకున్నారు. కౌసల్యా కౌన్సిలింగ్ సెంటర్ నిర్దేశకులు డాక్టర్ నిహాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఇక్కడితో ఆగదని, ప్రతి ప్రాంతంలో నిర్వహించి తగిన సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ పద్మ, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ పాల్గొన్నారు.

కేన్సర్ నియంత్రణలో చైతన్య స్రవంతి సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మహిళల్లో గర్భాశయ కేన్సర్ నియంత్రణకు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న కృషి ప్రశంసనీయమని దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎవిఎన్ కాలేజీ ఎదురుగా 37వ వార్డు సచివాలయంలో చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆదివారం నిర్వహించిన ది హ్యూమన్ పాపిలోమా వైరస్ నియంత్రణ కేన్సర్ వ్యాక్సిన్ బూస్టర్ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలో అత్యంత ప్రమాదకరమైన కేన్సర్ వ్యాధి నివారణకు చైతన్య స్రవంతి ముందుకు రావడం ముదావహమని అన్నారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్‌ను అభినందించి శాలువాతో సత్కరించారు. కెజిహెచ్ రేడియేషన్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి, సీరం ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఏరియా బిజినెస్ మేనేజర్ బి.రాం రతన్, చైతన్య స్రవంతి ప్రతినిధులు రుకియా భాను, విజయకుమారి, అనసూయ, రోజా, సిహెచ్.లక్ష్మి, దేవి, లక్ష్మి పాల్గొన్నారు. 45 మంది బాలికలకు వ్యాక్సిన్ వేశారు.

జర్నలిస్టుల పిల్లలకు త్వరలో హెచ్‌పివి వ్యాక్సిన్

విశాఖ జిల్లాలో జర్నలిస్టుల కుటుంబాల్లోని 9 నుంచి 14 ఏళ్లలోపు ఆడపిల్లలకు హెచ్‌పివి వ్యాక్సిన్లను ఉచితంగా వేసేందుకు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు డాక్టర్ షిరీన్ రెహమాన్ ముందుకు వచ్చారు. సుమారు రూ.4 వేల విలువగల ఈ వ్యాక్సిన్‌ను రెండు డోసుల్లో తొలి దశలో 50 మంది ఆడపిల్లలకు ఈ క్రమంలో వేయనున్నారు. ఆడపిల్లలు పెద్దయ్యాక గర్భాశయ కేన్సర్ నియంత్రణకు ఈ వ్యాక్సిన్ ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ క్రమంలో ఆసక్తిగల జర్నలిస్టులు తమ పిల్లల వివరాలను 9849147350, 9848291749 నెంబర్లకు తెలియజేయాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ విశాఖపట్నం జిల్లా యూనిట్ ఒక ప్రకటనలో ఆదివారం కోరింది